# - కానుక -

* రచన : శ్రీ వై. వి. రాజారావు *

ట్రేయిన్ ఆగ్గింది. ఏదో స్టేషన్ వచ్చినట్టుంది.

ఉన్నట్టుండి నా చూపు యెందుకో యెడమ చేతి వజ్రపు టుంగరం వైపు పోయింది. బాంబేలోవున్న 'అబ్దుల్ రెహమాన్ రేడియో అండ్ ఎలెక్ట్రికల్స్ ప్రైవేట్ లిమిటెడ్' కంపెనీకి, నా చేతి వ్రేలిలోవున్న ఈ డైమండ్ రింగ్‌కూ యేదో అవినాభావసంబంధం వుంది.

\+ \+ \+

అది సెకెండ్ క్లాస్ కంపార్ట్‌మెంట్. అందులో వున్నది నేనూ, వో పంజాబీ, మరో సేట్ యిండియన్ గర్ల్ అంతే!

ఇంతలో యెవరో వొకతను మా కంపార్ట్‌మెంట్‌లోనికి వచ్చాడు. మొదట్లో యెవరో ప్యాసింజర్ అనుకొన్నాం. చూస్తే యెవరో ముస్లిమ్ యువకుడిలా వున్నాడు. సుర్‌వాల్ పైన జుబ్బా వేశాడు, మాసిన గెడ్డం, సన్నగా పొడుగ్గా వున్నాడు. వయసుకూడా జాస్తీ వుండదు. 30, 35 లోపే. మనిషి చూడగా యేదో బాధలతో సతమతౌతూన్నట్టగుపించింది.

చూడగా తెలిసింది. అది సికిందరాబాద్ రైల్వేస్టేషన్ అని. అది పూర్వం నైజాం రాజ్యంలో వుండేది. ఇప్పుడు ఆంధ్రుల రాజధాని, నగరం. అక్కడి ప్రజలు హిందీ-తెలుగు మాట్లాడుతారు.

ఆ కొత్త వ్యక్తి వోమారు మా కంపార్ట్‌మెంట్‌లో వున్నవారందరినీ కలియచూచాడు. అందరినీ వుద్దేశించి యిలా మొదలెట్టాడు:

'సలామ్ భాయీయో! రెండురోజులనుంచీ తినడానికి తిండి లేదు. కడుపు ఆకలితో మండుకొనిపోతోంది. మీరు మాపైన దయచూపి కొనుక్కొని తినడానికి యేదైనా దయచేయండి.'

దాంతో వాడెవరైందీ అందరికీ అర్థం అయింది.

'పైసా నై జావ్!' అని కసరుకొన్నాడు పంజాబీ.

'ఎంగె పోనాలుమ్ యిదే తొందరుదా' ఫణం. ఫణం. ఛీ! పోడా వెలియ' అని విసిగించుకొంది అందమైన అరవ పిల్ల.

దాంతో వాడి ప్రాణాలు పైనే లేచిపోయాయి. ఎంతో ఆశతో మా క్యారేజ్‌లోనికి వచ్చాడేమో పాపం వాడికి నిరాసే యెదురైంది. వాడి పరిస్థితి చూచి వాడిపైన నాకెందుకో జాలేసింది.

'ఏవూరబ్బాయి నీదని' అడిగాను నేను.

నా ఈ ప్రశ్నతో వాడికి యేదో ఆశారేఖ జనించినట్టయింది.

'ఈవూరేనండి!' అన్నాడు మెల్లిగా.

'అదిసరే, ఇంతవరకూ నీలాంటివారు థర్డ్ క్లాస్ కంపార్ట్‌మెంట్స్‌లోనే వుంటూండేవారు. అట్లాంటిది నీవు యెంతో ధైర్యంగా సెకెండ్ క్లాస్ పెట్టెలోనికి వచ్చావే.'

'ఏదో మీబోటి ధర్మప్రభువులు వుంటారని!' వణికాడు వాడు.

'ఇక్కడ నీకెలాంటి వాతావరణం యెదురైందీ చూచావుగా!'

'సార్ నన్ను మన్నించాలి. నేను మీరందరూ వూహించినట్లు అందరిమాదిరి బెగ్గరను కాను. కానీ విధి నన్ను మోసంచేసింది. అంచేతే యిప్పుడీగతి పట్టింది నాకు.'

'అలాగా. పాపం. ఇంతకూ నీ పేరేమిటి? ఇందాక ఏం చేస్తూండేవాడివి?'

For Quality and
Distinctive Printing ...

Malticolour Labels and
Photo Offset Calendars and
Reproductions of Extachrome
Colour Transparencies of Calendars.

Printed On up-Todate
Multicolour High Speed
Automatic Rotary Offset
Printing Machines.

*Please Consult :*

**THE CORONATION LITHO WORKS**

P.B. NO. 2 : : SIVAKASI (S.I.)
Phone : 54 & 254 Estd : 1936 rams : "CORONATION"

Branch Office :
**"THANJAI ILLAM" Ist Floor, 3, Sami Reddy St.,**
**EGMORE, : : MADRAS-8**
Phone : 87818

నా మాటలతో వాడికి కొంత ధైర్యం వచ్చింది. యిలా చెప్పసాగాడు:

'నా పేరు అబ్దుల్ రెహమాన్. నా తల్లి దండ్రులు యెలా వుండేవారో నాకు తెలీదు. కారణం నేను చాలా చిన్న పిల్లాడిగా వుండగనే వారు గతించారు. అప్పటినుంచీ నన్ను మా నాయనమ్మే పెంచి పెద్దచేసింది. నా దురదృష్టవశాత్తు నాకు యెక్కువ చదువబ్బలేదు.

తత్ఫలితంగా నాకు మంచి వుద్యోగం దొరికే అవకాశం లేకపోయింది. ఏదో వొక కంపెనీలో కొన్నాళ్ళు పనిచేశాను. కొద్దిరోజులకు ఆ కంపెనీ దివాలా తీసింది. తరువాత నాకు వుద్యోగం దొరకడం కష్టమయిపోయింది. ఎన్నో కారణాలవల్ల నేనీ స్థితికి దిగజారిపోవలసి వచ్చింది.'

పాపం రెహమాన్ దీన గాథ విని నాకు వాడిపైన చాలా జాలేసింది. వోక్షణంసేపు ఆలోచించా. తదుపరి వాడితో యిలా అన్నా: 'చూడు రెహమాన్. నీకు పూర్తిగా యిష్టమయితే, నీవు నాతో రాగలవా? అన్ని విషయాలు నేను చూచుకొంటాను.'

వాడేమనుకొన్నాడోయేమో, వో క్షణంసేపు ఆలోచించి, సరేసార్!' అన్నాడు.

'అయితే వెంటనే వెళ్ళి ఢిల్లీకి వో టికెట్ తీసుకొనిరా నీకోసం!' అని వాడిచేతికి వో, నూరు రూపాయల నోటిచ్చాను. రెహమాన్ వెళ్ళి వో పది నిముషాల్లో తిరిగివచ్చాడు వో టికెట్ మిగతా చిల్లరతో. తరువాత పది నిముషాల్లో ట్రెయిన్ కదిలింది.'

ఆ తరువాత మా యిద్దరిమధ్య యేమంత

యెక్కువ సంభాషణ సాగలా. నే నెప్పుడు పడుకొన్నానో, నాకే తెలియదు. ఢిల్లీ సేషన్ రానేవచ్చింది. ఇద్దరూ వో టాక్సీ యెంగేజీ చేసుకొని యిల్లు చేరుకొన్నాం.

\+ + +

నేను ఢిల్లీలో వో పెద్ద రేడియో కంపెనీలో ఇంజనీర్‌గా పనిచేస్తున్నాను. నెలకు జీతం వెయ్యిరూపాయలవరకూ వస్తుంది. నా కింకా పెళ్ళికాలేదు. అంచేత ఆ యింటిలో నేను వొంటరిగానే వుంటున్నాను. ఇప్పుడు అబ్దుల్ రెహమాన్ నాతోపాటు వచ్చాడు. ఒకరికి యిద్దరయ్యాం యిప్పుడు.

అప్పుడే మేము ఢిల్లీకివచ్చి పదిరోజులయింది. మొదట్లో రెహిమాన్ కేమీ పని వుండేది కాదు అంతగా, నాకు రుచిగా వంట చేసి పెట్టటం తప్ప. వోరోజు వుదయం నాముందుకు వచ్చి నిలుచున్నాడు రెహమాన్.

'ఏంటి సంగతి' అన్నాను.

'ఏం లేదండి. ఇంటిలో నాకు ప్రొద్దుపోవటం చాలా కష్టంగా వుంది. యేదైనా పనివుంటే చెబుదురూ' అన్నాడు.

వెంటనే యేదో మెరపులా వో అయిడియా వచ్చింది. నాకు.

''అయితే రెహమాన్ నీకో పని నేర్పిస్తా నేర్చుకొంటావా?'

'ఏమిటీసార్ అది?'

'రేడియోల రిపేరి' అన్నాను సరదాగా!

'నేను నేర్చుకోగల శక్తి వుందన్న నమ్మకం మీకుంటే తప్పకుండా నేర్చుకోవాలన్న కుతూహలం నాకుంది! అన్నాడు అబ్దుల్ రెహమాన్ యెంతో వుత్సాహంగా.

అంతే! ఆ రోజునుంచే పని ప్రారంభించాం. నేను కంపెనీలో పవి చేసే పరిచయంవల్ల నా యింటిదగ్గిరకి కూడా స్నేహితులు రేడియోలు తెస్తూండేవారు రిపేర్ల కని. అంచేతే ఆ అనుకూలంవల్ల రెహమాన్ కి రేడియో రిపేరింగ్ నేర్పించే అవకాశం కలిగింది. అంతేకాదు రెహమాన్ స్వతహాగా కాస్త బుద్ధిమంతుడుగా కనిపించాడు. యేదైనా వొక్కసారి చెబితే బాగా గ్రహించి జ్ఞాపకం పెట్టుకొనేవాడు. అంచేత నేను రేడియో రిపేరింగ్ టీచ్ చేయడం మొదలుపెట్టిన ఆరు మాసాలకంతా చాలా వరకూ నేర్చుకొన్నాడనే చెప్పాలి.

రెహమాన్ కృషి నిర్విరామంగా కొనసాగింది. నేనూ శ్రద్దగా చెబుతూండే వాడిని. అతడుకూడా నాకంటే శ్రధ్ధగా నేర్చుకుం



TAJMAHAL
CHEWING TOBACCO
Exporters Of Raw & Manufactur
Special kind Of Chewing Tobacco
PHONE. No. 28
GRAMS: TAJMAHAL
M. N. A. MOHAMED SULTAN & SONS, TAJMAHAL TOBACCO COMPANY
POST BOX No. 29
PUDUKKOTTAI. [S. INDIA]




టూండేవాడు. మనసుపెట్టి నేర్చుకో గలిగితే మానవుడు సాధించలేనిదేదీ లేదీప్రపంచంలో.

ఆటుపైన రిపేర్సుకివచ్చే రేడియోస్, ట్రాన్సిస్టర్స్. అన్నీ రెహమానే స్వయంగా రిపేర్చేసి పెడుతూండేవాడు. మా బిల్డింగ్ ముందు వో చిన్నబోర్డ్ తగిలించినందువల్ల రిపేర్సుకని రేడియోస్, ట్రాన్సిస్టర్లూ బాగానే వస్తూండేవి.

రోజులు గడచిపోతూండేవి. వాడి వ్యాపారం బాగా సాగిపోతూండేది. అదృష్టం కలసి రావడం వల్ల లాభాలుకూడా బాగా వస్తోండేవి.

రాను రాను ఆ వ్యాపారాన్ని యింకా అభివృద్ధిచేసి, వో రెగులర్ కంపెనీగా మార్చాలని వో మంచిరోజు చూచాను.

'అబ్దుల్ రెహిమాన్ రేడియో అండ్ ఎలక్ట్రికల్' అని పేరు పెట్టాము. ఇద్దరు ముగ్గురు స్టాఫ్ మెంబర్లు పనిచేస్తుండేవారు. మెకానికల్ సెక్షన్‌లో నలుగురు మెకానిక్స్ కూడా పని చేయసాగారు.

వో రోజు అబ్దుల్ అన్నాడు నాతో, మన కంపెనీలోనే పని యెక్కువగా వుందని, నన్ను సూపర్‌వైజ్ చేస్తూవుండవలసిందనీ, అంచేత నేను చేస్తుండిన వుద్యోగం వదలిపెట్టమని. మరి కొద్దిరోజులకు, వాడు చాలాబలవంతం చేయడంవల్లనైతేనేమీ నా అవసరం చాలా ముఖ్యంగా యేర్పడడంవల్లనైతేనేమీ నేను ఆపని చేయక తప్పలేదు. ఆఖరకు అంటే - యిప్పుడు నేను చేస్తున్న పని అంతా వర్కర్స్ సరిగా పనిచేస్తున్నారా లేదా అని చూడటం, కాష్, సేల్స్ పొజిషన్ మాత్రం చూస్తూవుండటమే. రోజులు దొర్లిపోసాగాయి.

\+ \+ \+

అరోజు సాయంకాలమే అబ్దుల్ నావద్దకువచ్చి "సార్ మీచేతి ఎడమవ్రేలు కొంచెం యిలాయివ్వండి! 'అని అంటూ యింకా నేను యివ్వబోయే లోపలే వాడు వో వజ్రపుటుంగరం నా చేతికి ఎకిపెట్టి 'సార్ అనుకోకుండా నాజీవితంలో యింత మార్పురావడానికి కారకులైన మీకు యిది, నా కానుక' అన్నాడు, నేనేమిటిది అని వాడిని అడుగకనే, అంతే, మా యిద్దరి జీవితాలు ఖులాసాగాసాగిపోతున్నాయి. ఈరోజువరకూ యెలాంటి బెడుదలే లేకుండా!